# కాకి రెట్ట

మహా గవాడు అమ్మా అన్నాడట- ఈ సామెతే గుర్తుకి వచ్చింది, ఎడతెరిపి లేకుండా యిటీవల మధురలో కురిసిన వానలు చూసేసరికి ఎక్కడెక్కడి చెరువులూ ఏక మయ్యాయి. ఎటుచూసినా జల ప్రళయం. చెరువుల గట్లు తెగిపోవడంతో పల్లపు ప్రాంతాలు నీటిలో మునిగి పోయినట్లుగా కనిపించింది. వాన నీళ్లు ఎక్కడ తమ యిళ్లల్లోకి వస్తాయో అన్న భయం కొద్దీ కొందరైతే చెరువుల గట్లు తెగ్గొట్టారు. అసలే రోడ్లు అంతంత, కురిసిన కుంభవృష్టికి రోడ్లు పాడయ్యాయి. రాకపోకలు స్తంభించి పోయాయి. బస్సులే కాదు. రైళ్లు కూడా రెండు రోజులు ఆగి పోయాయి. ఏమి బీభత్సం. ఎంత బీభత్సం! సాదురేగిన తలపొలాన నిలువదు-అన్న కవి వాక్యం కూడా గుర్తుకి వచ్చింది.

ఆ వానల్లో నేను గడపదాటి వీధి ముఖం చూడలేకపోయాను. ఎంతసేపని ఇంట్లోనే కూర్చోగలం. మహా విసుగనిపించింది. కాని చేసే దేముంది? కరెంటు వున్నంత సేపు రేడియో వింటూ అదీ విసుగు పుట్టినప్పుడు టీ.వి. చూస్తూ కాలక్షేపం చెయ్యసాగాను. ఇంట్లో కూరలు నిండుకున్నాయి. పాపం, కూరలమ్మే వాళ్లు మాత్రం ఏం అమ్ముతారు? అయినా కొందరు సాహసించి సెంట్రలు మార్కెట్‌కి వెళ్లి కూరలు తెచ్చి అమ్మసాగారు. పావుకిలో టొమాటోలు పది రూపాయలు... ఇలా ధరలు అమాంతం ఆకాశాన్నంటుకున్నాయి. అలాంటి సమయంలో ఏ ఊళ్లో నైనా ధరలు అలాగే వుంటాయి. కొనక తప్పదు, పొట్టనింపుకోకనూ తప్పదు. సామాన్యులు ఎంత అవస్థ పడుతున్నారో యేమిటో అనిపించింది. కన్నీటి చుక్కలు నా కనుకొలకుల్లో నిలిచాయి. ఇదే నా అశ్రుతర్పణమంటే!

ఆ రాత్రి టీ.వి.లో ఇంగ్లీషు వార్తలు విని నడుము వాల్చాలని మంచం వద్దకు వెళ్లాను. కాలింగ్ బెల్లు మోగిన చప్పుడయింది. ఈ వానలో – ఈ రాత్రివేళ– ఎవరు వచ్చారా అనుకుంటూ వేసిన తలుపులు తీసి, షట్టర్స్ ద్వారా తొంగి చూశాను. వచ్చిన వ్యక్తి ఎవరో సరిగా తెలియలేదు.

'నేనేనండి...గుర్తు పట్టలేదన్న మాట! లైటు వెయ్యండి...'

నేను లైటు వెయ్యాని సంగతి అప్పటికిగాని గుర్తుకి రాలేదు. ఎక్కడో విన్న గొంతులా వున్నదనుకుంటూ లైటు వేశాను.

'మీరు వూళ్లో వున్నారు. చాలా సంతోషం. ఈ వానల్లో ఎవరు మాత్రం ఎక్కడికి వెడతారులెండి. ఏమిటో అనుకున్నాను... నా తెలివి కాలిపోను...'

షట్టర్స్ తాళం తీసి, 'రండి రండి అనే లోపల ఆయన యిలా అన్నాడు. 'వానా కాలంలో దూరప్రయాణాలు చెయ్యడమంత తెలివితక్కువ పని మరోటి లేదంటే నమ్మండి. మీ వూరు చేరుకునేసరికి తల ప్రాణం తోకకు వచ్చినట్టయింది. మొన్న రాత్రి బయలుదేరాను. బస్సు ఎటో ఎటో వెళ్లి, చివరికెలా అయితే ఏం చేరవలసిన వూరు చేర్చింది. ఆ కథంతా తరవాత చెపుతాను వివరంగా,' అంటూ ఆయన లోపలికి వచ్చి కూర్చు న్నాడు. చూస్తే జాలి వేసింది 'మొన్న రాత్రి చేసిన భోజనం... అన్నాడు నీరసంగా.

'ఆయనతో మీరు మాట్లాడుతూ వుండండి. పది పదిహేను నిమిషా లలో భోజనం చేద్దురుగాని' అని మా శ్రీమతి అనేసరికి పోతున్న పరువు వచ్చినట్లనిపించింది. కూరలేమో లేవు. అర్ధరాత్రి వేళ ఆనాటి విష్ణుచిత్తుని యింటినుంచి...నాస్త్యోదన సౌష్టవంచ కృపయా భోక్తవ్యమన్ మాటలున్ వినిపిచేవట! ఇప్పుడు నాకు ఆమాటలే వినిపిస్తున్నాయి. 'మీ భోజనం మాటే మరిచిపోయాను. అన్యథా భావించకండి,' క్షమించమన్నట్టుగా నేను ముఖం పెట్టి ఆయన వైపు చూశాను.

'బాబూగారూ, నీళ్లు కాగాయి. స్నానం చెయ్యండి' మా శ్రీమతి అనగానే ఆయన స్నానానికి లేచాడు.

ఆయన స్నానానికి వెళ్లగానే నేను వంటింట్లోకి వెళ్లాను, శ్రీమతి వంట ప్రయత్నం ఎంతవరకు వచ్చిందో చూద్దామని. డబ్బాలోంచి పడియాలు అప్పడాలు తియ్యడం చూశాను. 'కూరా నారా లేదు...' నసిగాను.

'అర్ధరాత్రిపూట కూర లెందుకండి? మనం ఎవరమో మీరు మరిచిపోయినట్టున్నారు...' శ్రీమతి నవ్వుతూ అన్నది.

ఆమె నవ్వులోని అంతర్యం తెలీక, నువ్వంటున్నది ఏమిటి? అన్నట్టుగా చూశాను.

'అర్థరాత్రి కాదు అపరాత్రి కాదు, ఎప్పుడొచ్చినా ఫరవాలేదు. పచ్చళ్లు, ఊరగాయలు లేని తెలుగువాళ్లు వుండరన్న సంగతి మీకు తెలియకపోయె, యిన్నాళ్లు మనం సంసారం చేస్తున్నా...' అంటూ ఆమె తన పనిలో మునిగిపోయింది.

'చెయ్, నువ్వూ నన్ను ఎగతాళి చేస్తున్నావ్!' నా ఆత్మాభిమానం కొంచెం దెబ్బతింది. 'అరవదేశంలో వున్నా, అరవమంటే వల్ల మాలిన అభిమానం వున్నా, తెలుగు వాణ్ణనే విషయం నేనెప్పుడూ మరిచి పోలేదు...' సంజాయిషీ చెప్పుకున్నాను.

'ఇహ మీదే ఆలస్యం.' స్నానం ముగించుకుని భోజనానికి సిద్ధంగా వున్న ఆయన మాటవినిపించింది. మా శ్రీమతి ఎందుకో తటపటాయిస్తోంది. ఆయన ఏమనుకున్నాడో యేమిటో, 'ఫరవాలేదమ్మా పీట లేకపోతేయేం, నిక్షేపంలాంటి టేబులుంది. దానిమీదే వడ్డించు. ఆపద్ధర్మం...' అన్నాడు.

'మరో ఆపద్ధర్మం...'

'స్టీలు పళ్లెం అరిటాకు కాదుటండీ..' ఆయన లౌక్యం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. 'ఈ పూటకీ సరిపెట్టుకోండి. రేపు అరిటాకులూ అవీ తెస్తాను..' నా మాటలు ఆయనకి వినిపించి నట్టులేదు. ఆయన పక్కనే కూర్చున్నాను.

ఘోటు ఘోటు మని ఆకలితో వున్నాడు కాబోలు, ఆయన చూపులన్నీ పళ్లెం మీదే వున్నాయి. పొగలు గక్కుతున్న అన్నం, కందిపున్ని, అప్పడాలు, వడియాలు. కందిపున్ని కలుపుకున్నాడు. మరికాస్త నెయ్యి వేసుకున్నాడు. రెండు ముద్దలు తిని ఆంధ్రమాత వున్నదనుకుంటా' అన్నాడు.

జాడీలోంచి గోంగూర తీసుకువచ్చి మా శ్రీమతి, 'మా ఆవకాయి కూడా కొంచెం రుచి చూడండి' అంది.

ఆయన అప్పడాలు వడియాలు కూడా కలుపుకున్నాడు. 'అరవ్వాళ్ల అప్పడాలు యిలా అన్నంలో కలుపుకోలేం.' అన్నాడు. అప్పుడనిపించింది నాకు, యిన్నాళ్లుగా అరవదేశంలో వున్నా మా భోజనపద్ధతులేమీ మారలేదని.

ఆయన భోజనం చేస్తున్నంత సేపు నాకు అల్లసాని పెద్దన మాటిమాటికి మనస్సులో మెదిలాడు. 'పప్పుచారు కూడా కలుపుకోండి' అంటూ మా శ్రీమతి పప్పుచారు గిన్నెతో టేబులు వద్దకు వచ్చింది.

'పప్పుచారు కూడా పెట్టావా తల్లీ! పప్పు కలిస్తేనే చారుకి రుచి. లేకపోతే వట్టి చింతపండు నీళ్లకేం రుచి వుంటుందని.'

ప్రవరాఖ్యుడెవరో గాని ఆయన సహధర్మచారిణి మాత్రం అచ్చంగా తెలుగువారి ఆడపడుచే. అందుకే కాబోలు పెద్దన లాంటి మహాకవి ఆ యిల్లాలిని ఆసరాగా చేసుకుని గృహిణిని నోరార కీర్తించాడు. 'వండ నలయదు వేవురు వచ్చిరేని, అన్నపూర్ణకు నుద్దియౌ అతని గృహిణి.'

తృప్తిగా ఆయన భోజనం చేసినట్లు గ్రహించి ఎంతగానో సంతోషించాను. గడియారం పన్నెండు కొట్టింది.

ప్రయాణం బడలికపల్ల ఆయన బాగా నిద్రపోయాడు. మధ్య మధ్య లేచినట్లు నాకు తోచలేదు. అంటే మశకాలు దయతలచాయన్న మాట! అందుకు చాలా సంతోషించాను, ఆతిథ్యం మాట ఎలావున్నా.

ఆ రాత్రి ఎప్పుడు తగ్గిందో యేమిటో వాన వెనుక పట్టింది.

తెల్లవారింది. వెలుతురు అత్తవారింటికి వచ్చే నవోఢలా వచ్చింది అడుగులో అడుగువేసుకుంటూ. బ్రతుకు జీవుడా అనుకున్నాను. మా ఊరికి చైతన్యం సన సన్నగా వస్తోంది, మీనమేషాలు లెక్క పెడుతూ. వానంటే భయం పుట్టింది. విసుగూ కలిగింది.

కాయగూరల కొట్లు కనుల పండువు చేశాయి. మళ్లీ జల్లులు పడతాయేమో అన్న భయం కొద్దీ వారానికి సరిపడే కాయగూరలు తీసుకువచ్చాను. ఇంట్లో అన్నీ వున్నప్పుడు మనస్సు కేదో తృప్తి.

ఆయనా నేనూ భోజనానికి కూర్చున్నాం.

'రాత్రి మీరు సరిగా భోజనం చేశారో లేదో, పచ్చడి మెతుకులు! ఏం కావాలో అడగండి.

'మీరు చెప్పాలా!'

ముద్దపప్పు కలుపుకున్నాడు..కూర కలుపుకున్నాడు. ఊరమిరపకాయలు మధ్య మధ్య కొరుక్కుతిన్నాడు. కంది పచ్చడి, పులుసు... కలుపుకుని కడుపు నిండా తిన్నట్లే అనిపించింది నాకు. ఉన్నంతలో చక్కగా భోజనం పెట్టి సంతృప్తి కలిగింది.

భోజనానంతరం కొంచెం సేపు విశ్రమించి ఆయన సంచీ పుచ్చుకుని చెప్పుల్లో కాలు పెట్టుకున్నాడు.

'వచ్చిన బడలిక కూడా తీరకుండానే అప్పుడే బయల్దేరారేమిటి?' అడిగాను.

'పళని వెళ్లివస్తాను. ఒక వేళ రాకపోతే, మా వూరికి వెళ్లినట్టుగా అనుకోండి...'

'రాకరాకవచ్చారు. అప్పుడే ప్రయాణమయ్యారు...'

'మనింటి భోజనం బాబుగారికి నచ్చిందో లేదో...' అంది మా శ్రీమతి.

'అదేం మాట తల్లీ! నచ్చంది భోజనం చేస్తానా?' అని, ఆయన నా వైపు తిరిగి, 'ఏమైనా మీలో ఆంధ్రత్వం తగ్గిందనండి!' అన్నాడు.

ఆశ్చర్యంలోంచి నేను తేరుకోక ముందే ఆయన అన్నాడు గదా. 'ఎందుకో గాని ఉప్పులూ కారాలు మీరు తగ్గించారు. కొబ్బరితురుము వేసి చేసిన కాబేజి కూర అద్భుతంగా వుందనుకోండి... ఏమిటో నాకు గడ్డికూరలు నచ్చవు. ఏమైనా కూరలంటే మనవైపునే, ఆ దొండకాయలు, దోసకాయలు... ఎంత రుచిగా వుంటాయని! కందిపచ్చడి కొంచం ఒగ్రగా వుంటే యింకా బాగుండేది. చప్పిడి కూరలన్నా, ఉప్పులూ కారాలూ తక్కువైన పచ్చళ్లన్నా నాకునచ్చవు. ఎవరి రుచులువారివనుకోండి...' 'అంతే లెండి...' 'నేను వెళ్లొస్తాను' అంటూ రాత్రి వచ్చిన అతిథి ముందుకు

నడవ సాగాడు. ఉన్నట్టుండి నా చూపు ప్రహరీ గోడమీద కూర్చుని అరుస్తున్న కాకివైపు మరలింది.

'ఇంతకూ మనింటిభోజనం బాబుగారికి నచ్చలేదన్న మాట!' శ్రీమతి నిట్టూర్చింది.

అరిచి అరిచి విసుగెత్తిన కాకి కాస్తా ఎగిరిపోయింది. పోతూ పోతూ రెట్టవేసి మరీ పోయింది. తర్వాత చూద్దునుగదా, ఆ రెట్ట నా తల మీద పడింది!

'ఇందాకట్నుంచీ కాకి అరుస్తూ వుంది. ఎవరొస్తారో యేమిటో...' అనుకుంటూ మా శ్రీమతి లోపలికి వెళ్లింది.

'ఎవరొస్తారో అని కాదు, ఎలాంటి వారొస్తారో...' అనుకుంది నా మనస్సు.